వైఎస్ఆర్
# కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
ఆదివారం 24 మే 2026



### శాంతియుత వాతావరణంలో
## బక్రీద్ పండుగ వేడుకలు జరుపుకోవాలి



2వ పేజీలో

### జనాభా గణన 2027
## మే 30, 2026 లోపు నమోదు తప్పనిసరి

**మైదుకూరు, మే 23, ప్రభాతవార్త:**
భారతదేశ జనాభా గణన 2027 ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన – ఆంధ్రప్రదేశ్ జనాభా గణన అధికారులు ఇంకా మీ ఇంటికి రాకపోతే వెంటనే 1855 హెల్ప్ లైన్ కు కాల్ చేయండి తప్పనిసరి.మే 30, 2026 లోపు సమాచారం నమోదు చేసుకోవాలి.డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్, ఆంధ్రప్రదేశ్ వారు తెలియజేయునది ఏమనగా భారతదేశ జనాభా గణన 2027 లో భాగంగా ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన ప్రక్రియ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నది. ఈ గణనలో భాగంగా ఎన్యూమరేటర్ అధికారి ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. ఎన్యూమరేటర్ మీ ఇంటికి ఇంకా సందర్శించకపోతే వెంటనే టోల్‌ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 1855 కు కాల్ చేసి సమాచారం అందించవలసిందిగా కోరడమైనది. అలాగే మైదుకూరు పురపాలక సంఘమునకు సంభందించిన హెల్ప్ లైన్ నెంబర్ : 7981421438 కు కాల్ చేయవలెను. గణనకు ఆఖరి తేదీ: 30వ మే 2026. జనాభా గణన చట్టం,1948 ప్రకారం మీరు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా మరియు సురక్షితంగా ఉంచబడుతుంది.

### జలధార కార్యక్రమాన్ని జిల్లాలో
# చక్కటి ప్రణాళికతో అమలు చేస్తున్నాం





**కడప, మే 23 ప్రభాతవార్త :**
నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల భాగస్వాములతో జలాధార కార్యక్రమాల ప్రణాళికలతో మరింత ప్రాధాన్యతతో పటిష్టంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శనివారం సాయంత్రం రాష్ట్ర సీఏడీఏ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు జలధార–జలహారతి కార్యక్రమంపై రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషన్ కుమార్ అన్ని జిల్లాల కాలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, రాజంపేట సబ్ కలెక్టర్ కేఎంసి కమీషనర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వైఎస్సార్ కడప జిల్లాలో "సాగు నీటి సంఘాల బాధ్యత"తో "జలధార జల హారతి" కార్యక్రమం కింద మండలాల వారీగా చెరువుల అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో మొత్తం 670 మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) చెరువులు ఉండగా, ఆయా గ్రామాలు జలధార నిర్వహణ ప్రణాళిక పరిధిలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఆ మేరకు అన్ని మండలాల్లో జలధార పనులు 60 శాతం మేరకు గ్రౌండింగ్ చేపట్టి శరవేగంగా జరుగుతున్నాయన్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్ సమీ, ఇరిగేషన్, ఆర్డబ్ల్యుఎస్ డిడి మురళిధర్, ఆర్డబ్ల్యూఎస్, డ్వామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### అవినీతిపై ప్రశ్నించేందుకు
# స్థాయి అవసరం లేదు

**ఎస్ఎస్‌మాల్‌లో రూములు కొనుగోలు చేసి ఇబ్బందులకు గురి కావొద్దు**

**టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి**



**ప్రొద్దుటూరు, మే 23, ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతిపై ప్రొద్దుటూరు ఓటరుగా తాను ప్రశ్నిస్తూనే ఉంటానని దీనికి స్థాయి అవసరం లేదని, ఎస్ఎస్ మాల్ కు సరైన అనుమతులు లేని కారణంగా రూములు కొనుగోలు చేసి ప్రజలు ఇబ్బందులకు గురికా వద్దని టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి.వీర ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం తన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి అవినీతిపై నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటానని అందులో భాగమే అవినీతి మయమైన ఎస్ఎస్ మాల్ షాపింగ్ కాంప్లెక్స్, కమర్షియల్ స్పేస్ ఎవరూ కొనుగోలు చేసి ఇబ్బందులకు గురి కారాదని సూచించారు. ఆ మాల్ భూమి నంద్యాల ఎస్.బి.ఐ లో తనఖా పెట్టారని, టౌన్ బ్యాంక్ లో కూడా మాల్ పేరుతో రుణం పెట్టారని, ఈ రుణాల మంజూరు విషయమై తాను ఆర్బీఐ కి ఫిర్యాదు చేశానని, విచారణ జరుగుతోందని వివరించారు. మరోక విషయం ఆ మాల్ కు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని కారణంగా అధిక పన్నులు కూడా చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. కావున ఇవి సమసి పోయిన తర్వాతే ప్రజలు రూములు కానీ కమర్షియల్ స్పేస్ కానీ కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎస్ఎస్ మాల్ కు లోన్ మంజూరు విషయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి రెండున్నర కోటి డబ్బు అందని పక్షంలో ప్రమాణం చేయాలని పిలుపునిచ్చారు. కాగా గత ప్రభుత్వంలో మున్సిపాలిటీ లోనే అధిక సమయం ఉన్న మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఎస్ఎస్ మాల్ కు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని విషయం తెలియదా అని ప్రశ్నించారు. తాను ఎస్ఎస్ మాల్ విషయంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన అవినీతి గురించి ప్రశ్నించినందుకు గానూ తనకు ఆయనను ప్రశ్నించే స్థాయి లేదని మాట్లాడటం సరి కాదన్నారు. తాను ప్రొద్దుటూరు ఓటర్ గా ప్రొద్దుటూరు ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే వుంటానని వివరించారు.

### పరిశ్రమల ఏర్పాటుతోనే
# నిరుద్యోగులకు ఉద్యోగాలు

**మాధవరం చేనేత పరిశ్రమ కోసం టెక్ట్సైల్ పార్క్**

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



జాబ్ మేళాలో ఎంపికైన నిరుద్యోగికి అపాయింట్మెంట్ లెటర్ అందజేస్తున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, మే 23 ప్రభాతవార్త**
నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య తీరాలంటే పరిశ్రమలు ఏర్పాటు చేయడమే ఏకైక మార్గమని అందుకు తమ వంతు కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అందుకు సహకారం అందిస్తున్నారని టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి స్పెషల్ ఎకనమిక్ జోన్ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన మాధవరం చేనేత పరిశ్రమ ఆధారంగా టెక్ష్టైల్ పార్క్ ఏర్పాటుకు ఆదేశించారని వెల్లడించారు. నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేంతవరకు యువత వెంటే ఉంటామని భరోసా ఇచ్చారు. ఈనెల పదిన రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు 405 మందికి శనివారం తన కార్యాలయంలో నియామక పత్రాలను జగన్మోహన్ రాజు పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ చిన్న పరిశ్రమ కూడా నియోజకవర్గంలో లేకపోవడం వల్లే నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఫలితంగా ఇక్కడి నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలియజేశారు. దీనిని అధిగమించాలంటే కుటీర పరిశ్రమల ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందన్నారు.ప్రతి గ్రామంలో చిన్న పరిశ్రమ ఏర్పాటు చేసినా స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.అంతేకాకుండా శ్రీసిటీ, తిరుపతి టిసిఎల్ వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తి పూర్తయితే ప్రతిరోజు ఇక్కడి నుంచే ఉచిత బస్సులలో పరిశ్రమలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు.అంతవరకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే రాజంపేటలో మహిళల కోసం ప్రత్యేక జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నిర్వహించిన జాబ్ మేళా ద్వారా కొన్ని అనుభవాలు తెలుసుకున్నామన్నారు. నిరుద్యోగులు ఎక్కువగా లోకల్‌గానే ఉద్యోగ అవకాశాల కోసం కావాలని అడుగుతున్నారని, ఇది సాధ్యం కావాలంటేస్థానికంగా పరిశ్రమల అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో ఒక పరిశ్రమ కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఒక టీమ్ ప్రత్యేకంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్, మాజీ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ భాష,పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్, తెలుగు యువత నాయకులు చినేపల్లి హరీష్ కుమార్, భూత్ ఇన్చార్జ్ అంజిబాబు ఆచారి, విజన్ 2047 టీం సభ్యులు, పాల్గొన్నారు.

# పురపాలక సంఘంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్



**మైదుకూరు, మే 23, ప్రభాతవార్త:**
రాష్ట్రవ్యాప్త సుదీర్ఘ పారిశుద్ధ్య అవగాహన డ్రైవ్‌లో భాగంగా మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు మైదుకూరు పురపాలక సంఘం పరిధిలో ప్రారంభమైన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో మొదటి రోజు అత్యంత ప్రతిష్టాత్మకంగా ముమ్మరంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ వై.రంగస్వామి, తహసీల్దార్ నరేంద్ర రాజసింహ, రెవెన్యూ సిబ్బంది,కనీస వేతనాల రాష్ట్ర బోర్డు డైరె క్టర్ దాసరి బాబు, ధనపాల జగన్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు బి.పి. సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ కోనా సుబ్బారావు ఇతర సామాజిక సేవా సభ్యులు,శానిటరీ ఇన్ స్పెక్టర్,వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు,మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది మరియు పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలు అందరూ కలిసి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగినది. మొదటి రోజు డ్రైవ్‌లో భాగంగా శ్రీ కృష్ణదేవరాయ కూడలి నుండి ప్రొద్దటూరు రోడ్డు మరియు బహిరంగ మూత్ర విసర్జన ప్రదేశాలు గుర్తించి క్లీనింగ్ చేయించడం అవగాహన కల్పించడం జరిగినది. బహిరంగ ప్రదేశాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత. ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడం, చెత్త వేయడం లాంటివి మాని మన మైదుకూరు నగరాన్ని స్వచ్ఛంగా, అందంగా ఉంచడంలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

## వేలకు రాని బస్సులు ప్రయాణికుల ఇబ్బందులు

**దువ్వూరు, మే 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరులో సమయానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు మండల కేంద్రమే కానీ కేవలం పల్లె వెలుగు బస్సులు తప్ప ఎక్స్ ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు కూడా బైపాస్ లోనే వెళ్లిపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మండల కేంద్రమైన దువ్వూరులో ఇటీవల స్థానిక శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రయాణీకుల సౌకర్యార్థం అలాగే ఆర్టీసీ బస్సులు నిలబడేందుకు గాను బస్సు షెల్టర్ కూడా ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యం ఉన్న ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఎన్నో అవస్థలు పడుతున్నారు. కేవలం ఆళ్లగడ్డ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సులు, మైదుకూరు డిపోకు చెందిన 2 పల్లె వెలుగు బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. కడప నుంచి ఉదయం పూట వెళ్లవలసిన ఎక్స్ ప్రెస్ సర్వీసులు వస్తాయో...రావో తెలియడం లేదు. ఒకరోజు వస్తాయి మరొక రోజు రావడం లేదు. ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఎందుకు రద్దు చేస్తున్నారో తెలియకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కడప నుంచి కర్నూలుకు వెళ్లే ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఉదయం పూట దువ్వూరులోకి వస్తే ఆసుపత్రులకు వెళ్లేవారు ఎక్కువమంది ఉంటారు. అటువంటి వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని సక్రమంగా బస్సులు నడిచే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### చెయ్యి చెయ్యి కలుపుదాం
# గ్రామాన్ని ఆదర్శనంగా నిలుపుదాం





**వేంపల్లి మే 23 ప్రభాతవార్త**
జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా పంచాయతీ అధికారి యం.వెంకట సుబ్బయ్య సంయుక్త ఆధ్వర్యంలో వేంపల్లి టౌన్ యందలి పరిశుద్ధముపై దండయాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయితీ అభివృద్ధి అధికారి నాగభూషణ్ రెడ్డి ఈ నెల 19 20 21 తేదీలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 30శాతం పారి శుద్ధ్యన్ని ఢీకా కోలిక్క తెచ్చారు. తదుపరి జిల్లా కలెక్టర్ వారి దిశానిష్టల మేరకు సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని మేజర్ పంచాయితల సిబ్బంది స్థానిక సచివాలయం సిబ్బంది మేజర్ పంచాయితీల పరిశుద్ధ సిబ్బంది జె.సి.బిలు మానవ మాత్రులచే జరిగే పనులకు సంబంధించిన పరికరాలు వగైరాలు వెంటనే సమయంలో గ్రామం మొత్తం పది జోన్లుగా విభజించి వక్కోజోన్ యందు ఉన్న స్లీపింగ్ డ్రైనేజ్ చెత్తకుప్పలపై ప్లాస్టిక్ వ్యర్థాలపై తొలగింపు చర్యలు చేపట్టారు. 2018 లో ఇలాగే నిర్వహించిన మాస్ శానిటేషన్ కార్యక్రమంలో ఒక్కో కిలో మీటర్ కు 26 ట్రిప్పుల మేర వ్యర్థాలు ఉన్న విషయాన్ని వేంపల్లి ప్రజానీకం ఇప్పటికీ గుర్తించుకొనే ఉన్నారు. ప్రస్తుతము నిర్వహించిన ఈ మాస్ శానిటేషన్ కార్యక్రమాలపై ప్రజల నుండి అభినందనలు వెల్లవిడుతున్నాయి. జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారుల ఉత్తర వలన సరించి చేసినప్పటికీ స్థానిక గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి నాగభూషణ్ రెడ్డి కేవలం వారం రోజుల్లో పదవీ విరామం చెందుతున్న సమయంలో ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం సరేవత్ర చర్చనీయాంశ మైంది. వేంపల్లి గ్రామపంచాయతీకి గత నెలల రోజులుగా ప్రత్యేక అధికారి లేనందు వల్ల చాలా ఇబ్బందులు ఎదురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారిగా పులివెందుల డిడిఓ వెంకటసుబ్బయ్య చార్జ్ తీసుకోవడంతో సమస్యలు సర్దుమనిగాయి.

### ప్రజల ఆరోగ్య సంరక్షణే
# కూటమి ప్రభుత్వ ప్రధాన బాధ్యత



**ప్రొద్దుటూరు అర్బన్, మే 23, ప్రభాతవార్త**
స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గానికి సంబంధించిన 28వ విడత 46 మంది లబ్ధిదారులకు 60.49 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మన ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని,ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరప్రదాయినిలా నిలుస్తోందన్నారు. ఆరోగ్యంతో పాటు విద్యారంగానికి కూడా మన ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,దరఖాస్తు చేసుకున్న వెంటనే మానవతా దృక్పథంతో స్పందిస్తూ,నిరుపేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు,టీడీపీ కడప పార్లమెంట్ కార్యదర్శి తలారి పుల్లయ్య ,టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య, మాజీ కౌన్సిలర్ జిలాన్ బాషా, టిడిపి నాయకుడు పగిడాల దస్తగిరి,మైనారిటీ నాయకులు నూరి,మాడెం సుధాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు,దుగ్గిరెడ్డి రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేల ఎకరాల్లో
# నేలకొరిగిన అరటి పంట

4 లో

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**దువ్వూరు, మే 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చిన్నసింగన పల్లె గ్రామంలో ఎంఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఏలినో ప్రభావము వలన ప్రకృతి వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పంటల విధానంలో రైతులు తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే విత్తన గుళికలు తయారు చేయు విధానాన్ని గ్రామానికి చెందిన చెన్నారెడ్డి భూమిలో తయారు చేసే విధానాన్ని వివరించారు. ఎఫ్ఎంపి చంద్రమ్మ ఆధ్వర్యంలో 30 రకాల విత్తనాలకు బీజామృతంతో విత్తన శుద్ధి చేసి భూసారం పెంచు కొనుటకు భూమిలో చల్లడం జరిగింది. దీని వలన సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూమి సారవంతమయంగా ఉంటుందన్నారు. అలాగే 200 కేజీల ఘన జీవామృతం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిఅర్టి వెంకట సురేష్, ఆదిలక్ష్మి, రమాదేవి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



## ఉద్యాన శాఖకు సంబంధించి 665.6 హెక్టార్లలో పంట నష్టం

**అంచనా రూ. 2.31 కోట్లు.. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**కడప, మే 23 ప్రభాతవార్త**
జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల జరిగిన పంట నష్టం పై క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి సిద్ధం చేసిన ప్రాథమిక నివేదికలను ప్రభుత్వంనకు పంపడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వలన జరిగిన పంట నష్టం పై జిల్లా కలెక్టర్ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల పెను గాలులు తో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు సంబంధించి క్షేత్రస్థాయి లో పర్యటించి సిద్ధం చేసిన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ఇంక నూ క్షేత్రస్థాయి లో వ్యవసాయ ఉద్యాన శాఖలకు సంబంధించిన సిబ్బంది పంట నష్టం అంచనా వివరాలను మరింత పగడ్బందీగా చేసి తుది పంట నష్టం వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఒంటిమిట్ట మండలంలోని కొత్త మాధవరం,సలాబాద్ గ్రామాలలో కోత దశలో ఉన్న వరి పంట దెబ్బతిన్నట్లు, ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 6 హెక్టార్లలో వరి పంట నేలకూలి,8 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఉద్యాన శాఖకు సంబంధించి 665.6 హెక్టార్లలో పంట నష్టం అంచనా రూ. 2.31 కోట్లుఉద్యాన పంటలకు సంబంధించి జిల్లాలో పులివెందుల,లింగాల, వేముల, వేంపల్లి,సింహాద్రిపురం తదితర మండలాల్లోని ఉద్యాన పంటలు 665.6 హెక్టార్ల లో 705 మంది రైతులకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాను ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా అరటిపంట 630 హెక్టార్లలో నష్టం వాటిల్లిందని పంట నష్టం అంచనా సుమారు 2 కోట్ల 31 లక్షలు గా ఉన్నట్లు ప్రాథమిక అంచనా అన్నారు.. మండలాల వారీ గా గ్రామాలలో బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ప్రారంభించడం జరిగిందని పూర్తిస్థాయిలో తుది పంట నష్టం నివేదికల కొరకు క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ప్రక్రియ ను పగడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా వ్యవసాయ,ఉద్యాన శాఖ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## మందుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



ముద్దనూరు, మే 23, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందును రైతులకు విక్రయించరాదని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి క్రిమిసంహారక మందుల దుకాణదారులకు శనివారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు క్రిమిసంహారక మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, 559 లీటర్ల పారాక్వాట్ డైక్లోరైడ్ 24 ఎస్.ఎల్ (నిషేధిత గడ్డి మందు) నిల్వలను గుర్తించారు. ఈ మందును తాత్కాలికంగా విక్రయించరాదని సంబంధిత డీలర్లకు ఆదేశించినట్లు తెలిపారు. అత్యంత విషపూరితమైన ఈ క్రిమిసంహారక రసాయనం మానవాళి మనుగడకు ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులు మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ఇటువంటి నిషేధిత గడ్డి మందులను పంటలపై పిచికారీ చేయరాదని కోరారు. ఈ కార్యక్రమంలో పురుగు మందుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## నిత్యపూజస్వామి హుండీ లెక్కింపు

సిద్ధవటం మే 23 ప్రభాతవార్త

మండలం వంతాటి పల్లి గ్రామం, లంకమల అభయారణ్యంలో వెలసియున్న శ్రీ నిత్యపూజస్వామి దేవస్థానమునకు సంబంధించిన హుండీలను 25 వ తేదీన సోమవారము ఉదయం 11:00 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కించుటకు నిర్ణయించడమైనది. కావున భక్తాదులు సదరు హుండీ పరకామణి నందు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ప్రార్థన అని ఆలయ ఛైర్మన్ మరియు ధర్మ కర్తల మండలి జంగిటి రాజేంద్రప్రసాద్ ఆలయ కార్యనిర్వహణాధికారి జి. కొండా రెడ్డి తెలిపారు.

## దైవకార్యాల్లో భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకృతం : తోడేటి సుబ్బయ్య



బద్వేల్ అర్బన్ మే 23 : ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధిలోని జాంబవంతనగర్‌లో వెలసిన శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ఎన్నారై తోడేటి సుబ్బయ్య కుటుంబ సభ్యులు రూ. 80,116/ విరాళం అందజేసి తమ అపార దాతృత్వాన్ని చాటుకున్నారు. శనివారం జాంబవంత నగర్‌లోని పునర్నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయాన్ని తోడేటి సుబ్బయ్య తన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నారై తోడేటి సుబ్బయ్య మాట్లాడుతూ ఆగిపోయిన దేవాలయ నిర్మాణాన్ని నేడు పునఃప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి పుణ్యకార్యాల్లో, దైవకార్యాల్లో మన వంతు భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. విరాళం అందజేసిన తోడేటి సుబ్బయ్య కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

## రాజంపేట నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో "మహానాడు"

రాజంపేట, మే23 ప్రభాతవార్త

రాజంపేట నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో "మహానాడు" కర్తమని ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తామని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు వెల్లడించారు. మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు,క్లస్టర్ ఇన్చార్జ్ లు,యూనిట్ ఇన్చార్జ్ లు,గ్రామ అధ్యక్షులు,బూత్ కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది మహానాడును వర్చువల్ విధానంలో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించడంతో,నియోజకవర్గంలో 10 క్లస్టర్లలో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి మహానాడు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ రాజు, రవికుమార్, నరసింహారెడ్డి, భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

# మోడీ 12 ఏళ్ల పాలనా కాలం ఒక చీకటి కాలం, శని కాలం

### కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోయర్ల సంఖ్య ఇందుకు నిదర్శనం. డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

వేంపల్లె మే 23 ప్రభాతవార్త

నరేంద్ర మోడీ ప్రధానమంత్రి పదవి పగ్గాలు చేబట్టి మే 26వ తేదీకి 12 సంవత్సరాలు పూర్తి అవుతుందని, ఈ 12 సంవత్సరాల మోడీ పాలనా కాలం భారతదేశ చరిత్రలో ఒక చీకటి యుగమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వేంపలిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ 12 సంవత్సరాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్ని రంగాలలో వైఫల్యం చెందిందని అన్నారు. భారతదేశం ప్రధానంగా వ్యవసాయ ప్రధాన దేశమని, ఇటువంటి దేశంలో మోడీ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా కుదేలైందని, రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దేశంలో నిరుద్యోగం వి లయతాండవం చేస్తోందని, ఉద్యోగాలు,ఉపాధి లేక నిరుద్యోగులు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారన్నారు. నిత్యావసర సరుకులు ధరలు, పెట్రోలు డీజీలు, వంట గ్యాస్, ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్యులకు అందుబాటులో లేవని అన్నారు. సిబిఐ, ఈడి, ఐటి, ఎలక్షన్ కమిషన్, తదితర రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని దుర్వినియోగం అయ్యాయని అన్నారు. మోడీ ప్రభుత్వం లీకుల ప్రభుత్వంగా, రద్దుల ప్రభుత్వంగా తయారైంది. మోడీ పాలనలో దాదాపు 89 సార్లు పరీక్ష పత్రాలు లీకయ్యాయని, దాదాపు 40 సార్లు పరీక్షలు రద్దు అయ్యాయని పేర్కొన్నారు. నీట్ లాంటి ప్రతిష్టాత్మక పరీక్షల పత్రాలు కూడా లీక్ కావడం, పరీక్ష రద్దు కావడం శోచనీయం. మోడీ పాలనా కాలంలో డాలర్ తో పోలిస్తే పోలిస్తే రూపాయి విలువ పాతాళానికి పడిపోయింది. దేశం అప్పుల భారత్ అయింది. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాల లో భారత ప్రభుత్వం 45 లక్షల కోట్లు రూపాయలు అప్పు చేయగా కేవలం 12 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం అదనంగా 155 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశం తలసరి ఆదాయంలో 142 వ స్థానంలో, ఆకలి సూచికలో 101 వ స్థానంలో, మానవాభివృద్ధి సూచికలో 130 వ స్థానంలో, సంతోష సూచికలో 144 స్థానంలో ఉండడం అత్యంత గర్హనీయం. మోడీ 12 ఏళ్ల పాలనలో దేశ రాజధాని ఢిల్లీ నగరం కాలుష్యం కారణంగా జీవించడానికి యోగ్యము కాని స్థాయికి చేరుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం మీద అసంతృప్తి,అసమ్మతి తెలియజేసేటందుకు ఏర్పాటు అయిన సోషల్ మీడియా కాక్రోచ్ జనతా పార్టీకి కేవలం ఐదు రోజుల్లో ఒక కోటి నలభై లక్షల మంది ఫాలోయర్లు వచ్చారు. మోడీ ప్రభుత్వం పై ఏ స్థాయిలో



ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తి ఉందో దీన్ని బట్టి తెలుస్తోంది. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గుణపాఠాలు నేర్చుకొని రాబోవు మూడు సంవత్సరాలలోనైనా సుపరిపాలన అందించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. లేకుంటే 2029 లోక్సభ సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం ఘోరమైన ఓటమిని చవి చూడక తప్పదని తులసి రెడ్డి హెచ్చరించారు.

# శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగ వేడుకలు జరుపుకోవాలి



కడప, మే 23 ప్రభాతవార్త :

ప్రతి ఒక్కరూ ఆచారాల వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకుని,సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. త్వరలో జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా శనివారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, రాజంపేట సబ్ కలెక్టర్,కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్.భావన, ఏఎస్పీ రామ్నాథ్ హెగ్డే, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక అయిన కడప జిల్లాలో బక్రీద్ పండుగ ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్న ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. అన్ని మతాలకు సంబంధించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగ చేయకుండా పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ముఖ్యంగా జంతువధ శాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పక పాటించాలన్నారు.ఎలాంటి మతపరమైన, సున్నితమైన అంశాలను సూక్ష్మ దృష్టిలో చూడకుండా అన్ని మతాల ప్రజలుసహనం, సంయమనంతో సంతోషంగా...సాంప్రదాయాలను గౌరవించుకుంటూ బక్రీద్ పండుగ ను నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం అతి వేగవంతంగా తప్పుడు సమాచారం సోషల్ మీడియా ద్వారా.. స్ప్రెడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్న యువతను కూడా కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే.. అన్ని మతాల చెందిన యువకులకు బక్రీద్ పండుగ నిర్వహణ, సంప్రదాయాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.స్లాటర్ హౌస్ ల వద్ద శానిటేషన్,మంచినీటి సరఫరా చేయాలని,అలాగే అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవిన్యూ యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి మండలంలో కూడా పీఎస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి.. సంబందిత పంచాయతీ,రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను చేస్తామని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యాత్మక స్లాటర్ హౌస్ ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్లాటర్ హౌస్ కు వెళ్లే జీవాలు తప్పక పశుసంవర్ధక శాఖ అధికారి ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగను ఇతరులకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలో బక్రీద్ పండుగ నిర్వహణకు సంబంధించి ఎస్ఓపి ప్రకారం చేపట్టాల్సిన చర్యలు, విధి విధానాలను వివరిస్తూ.. సంబంధిత జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హిదాయతుల్లా, ప్రాసిక్యూట్ అడ్మిన్ డీడీ, రెవిన్యూ, పోలీస్, ఆరోగ్య శాఖ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీ శాఖ, ఫైర్ శాఖ అధికారులు జిల్లా అధికారులు,పీస్ కమిటీ సభ్యులు, అన్ని మతాల మతపెద్దలు పాల్గొన్నారు.

# అరటి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది





పులివెందుల, మే 23 , ప్రభాతవార్త :

నియోజక వర్గంలోనీ లింగాల మండలంలోని మురారి చింతల, తాతిరెడ్డి పల్లె, కోమన్నుతల గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి తోటలను శనివారం పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పరిశీలించారు. సంబంధిత వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించిన ఆయన నేలకొరిగిన అరటి చెట్లు, పూర్తిగా దెబ్బతిన్న తోటలను స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్న బీటెక్ రవి, ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పంట నష్టంపై అధికారులు వెంటనే సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని సూచించిన ఆయన, నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా కృషి చేస్తామని చెప్పారు. అరటి తోటలు పూర్తిగా నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేయగా, వారికి ధైర్యం చెబుతూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, సురేంద్ర రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల బరిలో జనసేన అభ్యర్థులను నిలబెట్టుతాం

### పులివెందుల సమన్వయ కర్త డాక్టర్ హరీష్.



వేంపల్లె: మే 23 ప్రభాతవార్త

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జనసేనా పార్టీకి చెందిన అభ్యర్థులను కూడ బరిలో నిలబెట్టుతామని పులివెందుల జనసేనా పార్టీ సమన్వయ కర్త డాక్టర్ హరీష్ పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేనా నేతలతో, కార్యకర్తలతో సమన్వయ కర్త డాక్టర్ హరీష్ సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నేతలతో కలిసి జనసేనా కార్యకర్తలను కూడ నిలబెట్టేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అ దిశగా జనసేన పార్టీని కూడ పులివెందుల నియోజకవర్గం వ్యాప్తంగా బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. వార్డు, ఎంపిటిసిల ప్రకారం జనసేనాకు చెందిన వ్యక్తులను ఎంపిక చేయాలనే దానిపై కార్యకర్తలతో చర్చిస్తున్నట్లు తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట, వేముల, లింగాల, సింహాద్రిపురం, వేంపల్లె, తొండూరు, పులివెందుల మండలాల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టుతామని తెలిపారు. పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తలకు ముందుగా ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కూటమి భాగస్వామ్యంలో తమ పార్టీకి చెందిన జనసేన కార్యకర్తలకు ఎక్కువ సీట్లు వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనా పార్టీకి చెందిన అభ్యర్థులు కూడ ఎక్కువ స్థానాలలో గెలిచే అవకాశాలు ఉన్నట్లు వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గోసల ఆంజనేయులు, పెడపల్లి సుధీర్ రెడ్డి, పసుపులేటి శ్యామ్, దేవా, బాబావల్లి, ఇడుపులపాయి జయచంద్ర, హితేష్ , ఇమాం భాష, థామస్ పాల్గొన్నారు.

## మహిళ, పిల్లల అదృశ్యంపై కేసు నమోదు

ముద్దనూరు, మే 23, ప్రభాతవార్త:





మహిళతో పాటు పిల్లలు అదృశ్యమైన ఘటనపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసుల వివరాల మేరకు, అదృశ్యమైన మహిళ శిరీష స్వగ్రామం ఉప్పులూరు గ్రామం. పిల్లలకు వేసవి సెలవులు ఉండటంతో ఆమె తన పుట్టింటికి వచ్చారు. అనంతరం ఈ నెల 20వ తేదీన, తాను అనంతపురం జిల్లా గుత్తి మండలం ఎంగిలిబండ గ్రామంలో ఉన్న తన భర్త ఇంటికి వెళుతున్నానని చెప్పి అక్కడి నుంచి బయలుదేరింది. అయితే, ఆమె భర్త ఇంటికి చేరుకోకపోవడంతో భర్త సుధాకర్ సమీప బంధువులు, పరిచయస్తులు మరియు ఇతర ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై మధుసూదన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## పరామర్శించిన టీడీపీ నాయకులు



వేంపల్లి: మే 23 ప్రభాతవార్త

వేంపల్లి కు చెందిన టీడీపీ నాయకులు శనివారం సీనియర్ నాయకులు అయినా రౌఫాను పరామర్శించినారు,అందులో భాగంగా గత వారం రౌఫా ప్రమాదావశాస్తూ క్రింద పడి కాళ్ళు కు గాయం అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు మండల కన్వీనర్ మునిరెడ్డి, మాజి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షబ్బీర్,మండలఉపాధ్యక్షులు భద్ర,క్లస్టర్ ఇంచార్జి మొహమ్మద్, మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్,నాయకులు, డాక్టర్స్ కరీముల్లా, హీదాయాతుల్లాహ్,హుస్సేన్ పీరాన్,షరీఫ్,రమేష్ తదితరులు పాల్గొన్నారు,

## పారిశుద్ధ్య కార్మికులు, మహిళల సమస్యలపై బీటెక్ రవి ఆరా

పులివెందుల, మే 23 , ప్రభాతవార్త :

పులివెందుల మున్సిపా లిటీలో టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పారిశుద్ధ్య కార్మికులుతోను స్థానిక మహిళలతో సమా వేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న పని పరిస్థితులు, మౌలిక వసతుల కొరత, ఇతర ఉద్యోగ సంబంధిత ఇబ్బందులను వారు బీటెక్ రవి దృష్టికి తీసుకువచ్చారు. కార్మికుల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే స్థానిక మహిళలు తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. మహిళల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టితో పనిచేస్తామని బీటెక్ రవి పేర్కొన్నారు."పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి ఎంతో కీలకమైన సేవ అందిస్తున్నారు. వారి సంక్షేమం కోసం కృషి చేస్తాం. అలాగే మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తాం" అని ఆయన అన్నారు.స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుద్ధ కార్మికుల సమస్యలు వింటున్న బీటెక్ రవి

# ఆంజనేయ నగర్‌లో అయోధ్య శ్రీ బాలరాముని శోభాయాత్ర,వైభవంగా అభిషేకం

బద్వేల్ అర్బన్ మే 23 ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సాయంకాలం శ్రీ అయోధ్య బాలరాముని నూతన విగ్రహం శోభాయాత్ర కార్యక్రమం మైదుకూరు రోడ్ పోలేరమ్మ తల్లి దేవాలయం నుండి ప్రారంభమై బద్వేల్ నాలుగు రోడ్ల కోడలి నుండి ఆంజనేయ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయమునకు శోభాయాత్ర కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు, బాలరామునికి బద్వేల్ పట్టణంలో అడుగడుగున భక్తాదులందరూ మంచినీరు వారు పోసి కాయ కర్పూరం సమర్పించుకొని భక్తులు తమ భక్తిని చాటుకున్నారు, స్వామివారి వెంబటి జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ స్వామివారి నామస్మరణతో మారుమోగింది, పలువురు మహిళలు స్వామివారి కలశములతో జైశ్రీరామ్ అంటూ భారీ స్థాయిలో పాల్గొని స్వామివారి శోభాయాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేశారు, మార్చి 28, తారీఖున బాలరామని శోభాయాత్ర కార్యక్రమాన్ని బద్వేల్ నియోజకవర్గస్థాయిలో ప్రారంభించారు, మొదటగా చల్లగిరి కోదండరామస్వామి దేవాలయం ప్రాంగణంలో ప్రారంభించిన శోభాయాత్ర దాదాపు రెండు నెలల పాటు గ్రామీణ ప్రాంతాలలో స్వామివారి శోభాయాత్ర కనుల పండగగా నిర్వహించారు,ఈ కార్యక్రమాన్ని నరసింహ ఆధ్వర్యంలో కనుల పండగగా నిర్వహించడం పట్ల పలువురు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు, శనివారం ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అయోధ్య బాల రామునికి కనుల పండగగా వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, అనంతరం పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి కాయ కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు, ఈ కార్యక్రమంలో రామ గంగిరెడ్డి,కుందేళ్ల చిన్న సుబ్బయ్య, సముద్రాల పుల్లయ్య, పైడిమర్రి సురేష్ బాబు, సుదర్శన్ గుబ్బ వెంకటసుబ్బయ్య, చిన్ని శ్రీనివాసులు, యస్ రవికుమార్, రామకోటిరాజు, రవి,వల్లంకొండు శారదా, యం లక్ష్మి దేవి, కె, మహాలక్ష్మి, పేరూరు గాయత్రి, హైమావతి,పి,జ్యోతి, అయ్యపు సుభాషిణి,దేవి,ముచర్ల రమ్య, కుందేళ్ల సావిత్రి, సనిశెట్టి అరుణ,సుప్రజ, చిన్ని మనోహర లక్ష్మి, సోమిశెట్టి కుమరి, దేవాలయ కమిటీ సభ్యులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.







# వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

బద్వేల్ అర్బన్ మే 23 ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధి 16,వ వార్డు సుమిత్రానగర్ లో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఆలయ పూజారి వీరేశచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం కుంకుమ అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది, ప్రత్యేక అభిషేక దాతలుగా లక్ష్మీ నారాయణ రెడ్డి సతీమణి స్వర్ణ లత,మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బుతి చంద్ర శేఖర్ ధర్మ పత్ని వసంత లక్ష్మీ,పెద్ది వెంకట సుధాకర్ సతీమణి వసంత లక్ష్మీ, పులి బాలయ్య ధర్మ పత్ని తిరుపతమ్మ, కొణతాల పల్లి శ్రీనివాసులు ధర్మ పత్ని వెంకట లక్ష్మీ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది, పలువురు భక్తులు తెల్లవారుజామునండే ఆలయ ప్రదక్షిణాలు చేపట్టి భక్తిశ్రద్ధలతో స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు,ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మాడపూరు వెంకటరమణ మరియు పలువురు భక్తులు పాల్గొన్నారు.



# విద్యార్థులు అంకిత భావంతో చదవాలి

వేంపల్లి: మే23 ప్రభాతవార్త

విద్యార్థులు అంకితభావం, క్రమశిక్షణతో చదివితే జీవితంలో విజయాలు సాధించవచ్చని చిన్నయ్య అన్నారు. శనివారం డా. బీఆర్ అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. చదువుతో పాటు క్రీడలు, మంచి విలువలను అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమం లో ్ఛ. ఎస్ ఐ తిరుపల్ నాయక్ రామాంజనేయులు, జభిల్లాహ్ పాల్గొన్నారు.



**CHANGE OF SURNAME**

I, **YANAMALA ANUSUYA DEVI,** D/o **KONDA SRINIVASULU REDDY**, R/o at D.No.4/29C, Usman Nagar, Rajampet, YSR Kadapa Dist., A.P.-516115, hereby declare that my mother surname has been mentioned as **KONA LAKSHMI DEVI** (Old Surname) instead of **KONDA LAKSHMI DEVI** (New Surname) as mentioned in my Passport No.N50116640.

**CHANGE OF SURNAME**

I, **YANAMALA ANUSUYA DEVI,** D/o **KONDA SRINIVASULU REDDY**, R/o at D.No.4/29C, Usman Nagar, Rajampet, YSR Kadapa Dist., A.P.-516115, hereby declare that my father surname has been mentioned as **KONA SRINIVASULU REDDY** (Old Surname) instead of **KONDA SRINIVASULU REDDY** (New Surname) as mentioned in my Passport No.N50116640.

## పసుపు పండుగను విజయవంతం చేద్దాం

గండికోట సుధాకర్



రాయచోటి మే 23 ప్రభాతవార్త

పసుపు పండుగను విజయవంతం చేద్దాం అని రాయచోటి రూరల్ మండల అధ్యక్షులు గండికోట సుధాకర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27,28 తేదీలలో రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల నారాయణ కళ్యాణ మండపంలో జరగనున్న పసుపు పండుగను విజయ వంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. శనివారం అయన పార్టీ కార్యాల యంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మినీ మహానాడు కార్యక్రమానికి రాయచోటి మండల పరిధిలోని 9 గ్రామపంచాయతీలకు చెందిన గ్రామ కమిటీ నాయకులు, బూత్ కమిటీ నాయకులు, క్లస్టర్ కమిటీ అధ్యక్షులు, గ్రామ నేతలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు నాగార్జునరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లెకు రెగ్యులర్ తహాశీల్దార్‌ను నియమించండి



ఖాళీగా ఉన్న తహాశీల్దార్ కుర్చీ

మదనపల్లె, మే 23 ప్రభాతవార్త :

జిల్లాలోనే అతిపెద్ద మండలంగా ఉన్న మదనపల్లెకు రెగ్యులర్ తహాశీల్దార్‌ను నియ మించాలంటూ పట్టణ ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న తహాశీల్దార్ కిశోర్‌కు మార్‌రెడ్డిని నెలరోజుల క్రితం పలు ఆరోప ణలపై జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేయడం జరి గింది. అప్పటి నుంచి మదనపల్లెకు డిప్యూటీ తహాశీల్దార్ వెంకటస్వామి ఇన్‌చార్జ్ తహాశీ ల్దార్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోనే సెలక్షన్ గ్రేడ్ పట్టణం, రూరల్ మండ లంగా ఉన్న మదనపల్లెకు రెగ్యులర్ తహాశీల్దార్ లేకపోవడంతో రెవెన్యూ సమ స్యలు కుంటుపడుతున్నాయంటూ పలువురు చెబుతున్నారు. జిల్లా ఉన్నతాధి కారులు స్పందించి మదనపల్లెకు రెగ్యులర్ తహాశీల్దార్‌ను నియమించాల్సి ఉంది.

## పనసకాయల అమ్మకాల జోరు



రామసముద్రం, మే 23 ప్రభాతవార్త :

వేసవిలో పనసకాయల అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. రామసముద్రం బస్టాండులో తోపుడు బండ్ల వ్యాపారులు రామసముద్రం పురవీధులు తిరిగి అమ్ముతున్నారు. స్థానికంగా ఉన్న పరిసర ప్రాంతాల నుంచి కాయలను కొనుగోలు చేసి దిగుమతి చేసుకొంటున్నారు. పక్వానికి వచ్చిన కాయలను తోపడు బండ్లపై ఉంచి కొనుగోలు దారులకు అమ్ముతున్నారు. కొందరు కాయలను కోసి పనస తోళ్ళను అమ్ముతున్నారు. ఒక్కోకాయను రూ.150నుంచి 200వరకు అమ్ముతున్నారు. వాస్తవానికి బాగాపండినకాయ ఎంత సువాసన ఉంటుందో చెప్పనక్కరలేదు. ఎంతో రుచిగా ఉంటాయి. వీటిని తింటే ఆరోగ్యంగా ఉంటుంది. ఈ వేసవిలో తింటే చల్లదనంతో పాటు ఆరోగ్యంగానూ ఈ పనసతోళ్ళు ఉంటాయి.

## కోతి కాటుతో బాలికకు గాయాలు



బాలికకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త

కోతి కాటు వేయడంతో బాలికకు గాయాలైన సంఘటన శనివారం చౌడేపల్లి లో చోటు చేసుకొంది. పెద్దపంజాని మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ లింగమ నాయనపల్లికి చెందిన శ్రావణి(16) మండలంలోని పరికిదొన పంచాయతీ దొన పల్లి వద్ద పొలంలో టమోటా కాయలు కోసేందుకు తన తల్లికి తోడుగా వచ్చిం ది. పొలంలో వుండగా ఒక కోతి బాలికపై దాడి చేసింది. దాడిలో కాలు, చెవు లపై బాలికకు గాయాలయ్యాయి. శ్రావణిని కూలీలు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి సిఫారస్సు చేసారు.

## తేదేపా రాష్ట్రష అధ్యక్షుడిని కలసిన పతిరాజు



పల్లాను కలసిన పతిరాజు నాయకులు

చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును పుంగనూరు నియోజకవర్గ నాయకుడు మాదిరాజు లక్ష్మణరాజు(పతిరాజు)కలిశారు. విజయ వాడలోని ఆయన నివాసంలో కలసి తేదేపాకు కష్టపడ్డ కార్యకర్తల సమస్యలు, పరిణామాలను వివరించినట్లు ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని కోరినట్లు పతిరాజు తెలిపారు. అనంతరం పల్లా శ్రీనివాసరావును దుశ్శాలవాలతో సన్మానించారు. సింగిల్‌విండో ఛేర్మన్ పగడాల హరిరాయల్, ఆవుల రామచంద్రయ్య, కుమార్‌రెడ్డి, వేలూరు సుబ్రమణ్యం, కృష్ణారెడ్డి, వెంకట్రమణ తదితరులు పల్లాను కలసిన వారిలో వున్నారు.

# రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి.. ట్రాఫిక్ సి.ఐ ప్రసాదరావు

పులివెందుల, మే 23, ప్రభాతవార్త :

పులివెందులలో ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు, వాహన యజమానులకు రోడ్డు భద్రతపై ట్రాఫిక్ సీఐ జి. ప్రసాద్ రావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ బి. మురళి సూచనలతో ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. ప్రసాదరావు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఐ. ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పొల్యూషన్ సర్టిఫికేట్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ముఖ్యంగా ఆటో ముందు సీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టరాదని ఆటో డ్రైవర్లకు స్పష్టం చేశారు. అదేవిధంగా రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, వన్‌వేలోకి ప్రవేశించడం, రాంగ్ పార్కింగ్ చేయడం వంటి ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది శ్రీనివాసులు, మహేష్, శివశంకర్, మధుసూధన్‌తో పాటు ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు పాల్గొన్నారు.



# రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయండి

పేస్ యాప్ విధానం తక్షణమే రద్దు చేయాలి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతూ దృశ్యం

పీలేరు మే 23 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని కలకడ మండలం బాటవారిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడిన తర్వాత పోరాటాలు ద్వారానే ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందామని, రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, పేస్ యాప్ విధానం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం కలకడ మండలం బాటవారిపల్లి దగ్గర జరుగు తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి అనంతరం కూలీలతో మాటా డారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి హక్కును కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న జిరామ్ (బిళితిలీ) విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకమే వేలాది మంది నిరుపేద పేద కుటుంబాలకు ఆధారంగా నిలుస్తోందని అన్నారు. జాతీయ గ్రామీణ మహాత్మా గాంధీ ఉపాధి హా మీ పథకానికి కేంద్రం బడ్జెట్‌లో వేల కోట్ల రూపాయల కోత విదించిందని ధ్వజమెత్తారు గ్రామీణ కూలీల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో అమలు చేసు న్న రెండు పూటల ఫేస్ యాప్ విధానం వల్ల కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాంకేతిక సమస్యల కారణంగా హాజరు నమోదు కాక వేతనాలు నిలిచిపోతున్నాయని అన్నారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం, త్రాగు నీరు, గుడారాలు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు ప్రభుత్వం అందించాల్సిన పలుగు, పార, తట్టలు వంటి పనిముట్లు కూడా సరఫరా చేయాలని కోరారు పనిచేసిన ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు అమర్ నాథ్ కుమార్, ఓబులేసు, రామలింగయ్య, కళావతి, చిన్న రెడ్డప్ప, యశోదమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# పది రోజులుగా కరెంటుతో కటకటా

కరెంటు రాలేదని అధికారులను అడిగితే మీరు సక్రమంగా బిల్లులు కడుతున్నారా అని నిర్లక్ష్య సమాధానం..

..ఎస్సీలకు ఒక న్యాయం ఓసీలకు ఒక న్యాయం బిల్లు కట్టలేదని ఎస్సీలను వేధిస్తున్న రాయిచోటి డి ఈ..



రామాపురం, మే 23, ప్రభాతవార్త:

మండలంలోని చిట్లూరు, రామాపురం, సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు రెండు గ్రామాలకు గత పది రోజుల నుండి విద్యుత్తు లేక రైతులు గృహవినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. విద్యు త్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడో పోతదో తెలియదు. విద్యుత్ అధికారు లను విద్యుత్ కోసం మీరు యాడ సక్రమంగా బిల్లులు కడుతున్నారా అని నిర్లక్ష్య సమాధానం చెప్పి నీ మీటర్లు కట్ చేస్తాం అని జవాబు చెప్తున్నారు. దీంతో రైతులు గృహ వినియోగదారులు ఎక్కడ మీటర్లు కట్ చేస్తారో అని భయపడి విద్యుత్ అధికారులను విద్యుత్ కోసం అడ గడం మానేయడంతో వారికి ఎప్పుడు వీలు పడితే అప్పుడు వచ్చి మర మ్మతులు చేసి వారి ఇష్టపకారం విద్యుత్ వదులుతున్నారు. అలాగే విద్యుత్ బిల్లు వసూలులో పక్షపాతం చూపిస్తూ అగ్రవర్ణాలైనా ఓసీ బీసీలను ఒకరకంగా బిల్లులు అడగడం ఎస్సీ ఎస్టీలను బెదిరిస్తూ విచక్షణ రహితంగా వ్యవహరిస్తూ మీటర్లు పెరికేయండి అని సంబంధిత డీఈ దౌర్జన్యపరంగా వారి సిబ్బందికి సలహాలు ఇస్తూ ఎస్సీ ఎస్టీలను అవ మానపరుస్తున్నాడు బిల్లులు వసూళ్లలో భాగంగా వ్యవహరించే తీరు సిబ్బందితోపాటు ఆయన కూడా బాధ్యతారహితంగా పనిచేస్తే రైతులకు గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్తు ఎందుకు రాదని సరైన సమయానికి విద్యుత్ సరఫరా చేస్తే వినియోగదారులంతా బిల్లులు కూ డా సక్రమంగా కడతారనీ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికా రులు వేసవికాల దృష్ట్యా విద్యుత్ సమస్యపైన స్పందించి రైతులకు విని యోగదారులకు విద్యుత్ నిరంతర సరఫరా చేస్తారని కోరుకుంటున్నారు.

# నిన్ను విడచి నేను పోలేనులే...!

-కోతి కొమ్మ సామెతను మార్చేసిన వానరం -మహిళను వీడని వైనం



మహిళను వీడని వానరం

చౌడేపల్లి, మే 23 ప్రభాతవార్త

టమోటా పొలంలో కాయలు కాస్తున్న సమయంలో ఎక్కడి నుంచి వచ్చిందో వానరం మహిళ వెంట పడుతూనే వుంది...సాధారణంగా కోతులు కనిపిస్తే చేతిలో వున్న వస్తువులను లాక్కొంటాయోనో, దాడి చేస్తాయనో భయపడి దూరంగా పారి పోతారు...కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయ్యింది టమోటా తోటలోకి కూలీ పనులకు వచ్చిన మహిళను ఒక కోతి విడచిపెట్టకుండా వెంటాడుతోంది...ఆమె ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్తూ నీడలా ఆమె పక్కనే కూర్చొంటూ అందరినీ ఆశ్చర్యపరు స్తోంది...పెద్దపంజాని మండలం నాగిరెడ్డి పంచాయతీ లింగమనాయ నపల్లికి చెందిన పార్వతమ్మ గ్రామస్తులతో కలసి మండలంలోని పరికిదొన పంచాయతీ దొనపల్లి సమీపంలోని టోటమా పొలంలోకి కాయలు కోసేందుకు వచ్చింది. తోటలో ఆమె కాయలు కోస్తుండగా ఎక్కడి నుంచో ఒక కోతి అక్కడి వచ్చింది. మొదటి అందరూ అది ఆహారం కోసం వచ్చిందేమో అనుకొని కాస్తంత కంగారు పడ్డారు. అయితే ఆ వానరం ఎవరికీ ఎలాంటి హానీ తలపెట్టకుండా కూలీలలో ఒకరైన పార్వతమ్మ వద్దకు వెళ్ళింది. ఆమె ఎక్కడి వెళితే అక్కడి వెళ్తూ అందరినీ ఆశ్చరంలోకి నెట్టింది. ఈ వింత సంఘటనకు పార్వతమ్మ ఒక్కసారిగా నోరెళ్ళబెట్టింది. పని ముగించుకొని అందరూ ఆటోలో ఎక్కుతుండగా వానరం సైతం ఆటోలో ఎంచక్కా ఎక్కి మహిళలను విడచి పెట్టకుండా పక్కనే కూర్చొంది. చేసేది లేక ఆటోవాలా ఊరికి ఉడాయించాడు. మనుష్యుల మధ్య నమ్మకాలు, బంధాలు తగ్గిపోతున్న వేళ ఒక మూగ జీవి ఇలా మహిళపై చూపించిన నమ్మకం, సాన్నిహిత్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. ఏదిఏమైనప్పటికీ మహిళ-కోతిల అపూర్వ బంధం పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# పారిశుద్ధ్యమా నీ జాడ ఎక్కడ..

వృధాగా పోతున్న తాగునీరు, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్న గ్రామస్తులు



రామసముద్రం, మే 23 ప్రభాతవార్త

పరిశుభ్రమైన పారిశుధ్యం అనేది ప్రజా రోగ్యానికి, సంక్షేమానికి మూలస్తంభం. మురికివాడలు మరియు గ్రామాల్లో పారిశుధ్య లోపం వల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, సమాజంలో పారిశుధ్య ప్రమాణాలు మెరుగుపడటానికి కొన్ని కీలక అంశాలు అవసరం. పారిశుధ్య ప్రాముఖ్యత ముఖ్యాంశాలు దోమల నివారణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చు. మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి, కంపోస్టు ఎరువులు తయారు చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

## ఐకమత్యంతో మహానాడును విజయవంతం చేద్దాం

టిడిపి అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి



తంబళ్లపల్లె మే 23 ప్రభాతవార్త ః

రాష్ట్ర టిడిపి ఆదేశాల మేరకు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, అబ్జర్వర్ దినేష్ రెడ్డి సూచనలతో మండలంలో మహానాడు కార్యక్రమాన్ని ఐకమత్యంతో విజయవంతం చేద్దామని మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి పిలు పునిచ్చారు. శనివారం జరిగిన కార్యకర్తల సమీక్షలో ఆయన మాట్లాడుతూ మండలం లో రెండు క్లస్టర్లుగా రెండుచోట్ల మహానాడు జరుగుతుందని ప్రతి టిడిపి కుటుంబ సభ్యుడు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మండ లంలో టిడిపి నాయకులు ఐకమత్యంతో కలిసిమెలసి రాబోయే స్థానిక సంస్థల ఎన్ని కల్లో ఘన విజయం సాధించడానికి ప్రతి ఒక్కరు విభేదాలు మరచి కలసి రావాల న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసిధర్ నాయుడు, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్రమోహన్, మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, సిద్ధమ్మ, క్లస్టర్ ఇన్చార్జిలు బేరి శ్రీనివాసులు, కాలా నారాయణ, తెలుగు యువత నరసింహులు, పురుషోత్తం, వీరాంజనేయులు, రామచంద్ర, కసెట్టి వెంకటరమణ, నరేంద్ర, రామాంజులు, పెద్ద రెడ్డప్ప, నిజా ముద్దీన్, రాజేష్, గురుమూర్తి, ఆదిరెడ్డి, శివరాం, జయరాం రెడ్డి, వెంకటరమణ, రామచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర నాయుడు, జగదీష్, భాస్కర్, సోమశేఖర్, సురేంద్ర, బాబ్జాన్, రామ్మోహన్, శేఖర్ రెడ్డి, ఐసుల కృష్ణ, దండువారిపల్లి రమణ, నరసింహనాయుడు, శివకృష్ణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిభావాలను పెంపొందించుకుందాం



అన్నదానాలను వితరణ చేస్తున్న దృశ్యం

వాల్మీకిపురం, మే 23, ప్రభాతవార్త:

సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగు అవుతున్న తరుణంలో ప్రజలు భక్తి భావాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం తితిదే ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభిరామాలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదాలను ఎమ్మెల్యే భక్తులకు వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తితిదే ఆలయమైన పట్టాభిరామయంలో భక్తులు విరివిగా సొంత ఖర్చులతో అన్నప్రసాదాలను వితరణ కార్యక్రమాన్ని నిర్వహించవచ్చునన్నారు. మన ఊరు, మన ఆలయాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తితిదే అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## స్వాస్థ ఆసుపత్రిచే ఉచిత వైద్య శిబిరం

రామసముద్రం, మే 23, ప్రభాతవార్త:

రామసముద్రం మండలంలోని మూగవాడి గ్రామంలో ని గుండ్ల పల్లె గ్రామంలోని పాఠశాల లో శనివారం గుండ్లపల్లె శివారెడ్డి ఆధ్వర్యంలో స్వాస్థ్య ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు, ఉదయం నుండి గ్రామస్థులకు రోగులకు వైద్య సేవలు అందించాలని టిడిపి సీనియర్ నాయకులు గుండ్లపల్లె శివారెడ్డి వైద్యాధికారులను కోరారు. ఈ వైద్య శిబిరంలో స్వాస్థ్య ఆసుపత్రి డాక్టర్ లు ఆదర్ష్, జనరల్ మెడిసిన్ శశికళ, కీర్తీష్ వైద్య సిబ్బంది ప్రజలకు, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు, ముఖ్యం గా గ్రామాల్లో ఉన్న ప్రజలకు బి పి, షుగర్, మోకాళ్ళ నొప్పులు వివిధ జబ్బులతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అత్యవసర జబ్బులు కలిగిన వారికి మదనపల్లి లోని స్వాస్థ్య ఆసుపత్రికి రెఫర్ చేశారు, ఆసుపత్రి డాక్టర్ లు మాట్లాడుతూ స్వాస్థ్య ఆసుపత్రిలో వైద్యులు 24 గంటలు అందుబా టులో ఉంటారని జనరల్ మెడిసిన్ ఆర్థో పెడిక్, ప్రసూతి వైద్య విభాగ ము, జనరల్ సర్జరీ, ఫిజియో థెరపి దంతవైద్య విభాగం, పిల్లలవైద్య విభాగం వెంటిలేటర్ సదుపాయం కలదని, అత్యవసర యాక్సిడెంట్ కేసులు చూడడం జరుగుతుందని, స్త్రీలకు సంబందించిన వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తామని, ముఖ్యం గ్రామాంతర ప్రజలకు ఒపీ లు ఉచితంగా చూడడం, హాస్పిటల్ ఇన్ పేషట్లుకు బెడ్ చార్జీలు ఉచితమని ప్రొసీజర్ చార్జీలు ఉండవని, ఆసుపత్రి లో మందులు, డయా గ్నోస్టిక్స్ చార్జీ లు, ఆపరేషన్ కు ఉపయోగించే వస్తువులు పై మాత్రమే తీసుకుంటారని ప్రతి రోజు అన్ని విభాగాలకు సంబందించిన డాక్టర్ లు అందుబాటులో ఉంటారన్నారు, ఈ ఉచిత శిబిరంలో 160మంది గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని టిడిపి సీనియర్ నాయకులు గుండ్ల పల్లె శివారెడ్డి తెలిపారు, ఈ ఉచిత వైద్య శిబిరం మాగ్రామ పంచాయతీ లో నిర్వహించినందుకు మీ ఆసుపత్రి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తున్నా, ఉచిత వైద్య శిబిరానికి విచ్చేసిన డాక్టర్ లకు, వైద్య సిబ్బంది కిభోజనం వసతి శివారెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు, ఈ ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ లు ఆదర్ష్, శశికళ, కీర్తీష్, ఆసుపత్రి వైద్యులు హాస్పిటల్ మార్కెటింగ్ ఫీల్డ్ ఆఫీసర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలి



ములకలచెరువు మే 23 ప్రభాతవార్త

మండలంలోని ముస్లింలు ప్రశాంతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని మొలకలచెరువు సిఐ దస్తగిరి సూచించారు. శని వారం స్థానిక సర్కిల్ కార్యాల యంలో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ దస్తగిరి మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. అదేవిధంగా శాంతి భద్రతలకు ఆటంకం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి, ముస్లిం పెద్దలు ఉన్నారు.

## నిమ్మనపల్లిలో నేరాలపై అవగాహన సదస్సు



నిమ్మనపల్లి మే 23 ప్రభాతవార్త

నిమ్మనపల్లి మండలం లోని వడ్డిపల్లి లో శనివారం ప్రజలతో ఎస్సై నేరాలపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ అవగాహన సదస్సులో సైబర్ నేరాలు రోడ్డు ప్రమాదాలు,. బాల్య వివాహాలు, గంజాయి మాదక ద్రవ్యాలు అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనుమానుతులుగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు..

## రామాలయ భూముల
# పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



బద్వేలు అర్బన్, మే 23, ప్రభాతవార్త

పట్టణంలోని గౌరీశంకర్ నగర్‌లో ఉన్న రామాలయాన్ని బీజేపీ కిసాన్ మోర్చా కడప జిల్లా అధ్యక్షులు అన్నపురెడ్డి అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందూ బంధువులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయానికి సంబంధించిన భూమిపై ఆక్రమణలు జరుగుతున్నట్లు గుర్తించిన నాయకులు, సంబంధిత సర్వే నంబర్లలో ఉన్న భూముల రికార్డులను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. అసలైన పట్టాదారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఆలయ భూములను పరిరక్షించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. దేవాలయ ఆస్తులు అక్రమాలకు గురికాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ రూరల్ మండల అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ కడప జిల్లా కార్యవర్గ సభ్యులు కాకర్ల రవి చంద్ర రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి తిరుపాల్, కృష్ణారెడ్డి, అజయ్, చందు కుమార్‌రెడ్డి, శివారెడ్డి, ఆలయ ధర్మకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## వృద్ధులకు వికలాంగులకు
# ఇంటి వద్దకే రేషన్ సరుకులు



ముద్దనూరు, మే 23 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని రేషన్ డీలర్లతో డిప్యూటీ తహసీల్దార్ వరద కిషోర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ, మండలంలోని రేషన్ డీలర్లు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని 31 డీలర్ షాపులు రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సుజిత్, ఇన్‌చార్జ్ ఆర్ఐ రాజశేఖర్‌నాయుడు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

# వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ సజావుగా జరగాలి



ప్రొద్దుటూరు అర్బన్ మే 22 ప్రభాతవార్త

వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియలో వార్డుల్లో గందరగోళాలు ప్రజలు జనసేన పార్టీ దృష్టికి తెచ్చారని వాటిని పరిష్కరించారని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక వీధిలో ఒక చెంప ఒక వార్డు మరో చెంప ఇంకో వార్డు కలిపారని వీటివల్ల శానిటేషన్ తో పాటు టౌన్ ప్లానింగ్ వంటి సమస్యలు వెదుర్ల బజార్ లోని వాసులు తోపాటు పలు వీధుల్లో వారు కూడా మా దృష్టికి తెచ్చారని వాటిని పున పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ను కోరినట్టు ఆయన తెలిపారు.

# వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సుండుపల్లె, మే 23,ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఎన్ జే ఆర్ కాలనీ ఆరోగ్య పురంలో వెలసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము నందు స్వామివారికి అభిషేకము పూల అలంకరణ అనంతరం ధూప దీప నైవేద్యం సమర్పించడం జరిగినది తదుపరి మహా హారతి ఇవ్వడం జరిగినది అలాగే ఆంజనేయ స్వామి వారికి మరియు గరుడ స్వామి వారికి తులసి మాతతో పాటు మహాగణపతి స్వామి వారి పూజ అనంతరం ధూప దీప నైవేద్యం సమర్పించి మహా హారతి ఇవ్వడం జరిగిందని అర్చక స్వామి అమ్మనాయక్ తెలియజేసారు.

# పశుగ్రాసం కొరత లేకుండా చూసుకోవాలి

ఒంటిమిట్ట మే 23. ప్రభాతవార్త

ఒంటిమిట్ట మండలం రాచగుడి పల్లి గ్రామంలో శనివారం పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఉమా ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా వారు గ్రామంలోని రైతులతో మాట్లాడుతూ ఎండాకాలంలో పశువులకు పశుగ్రాసం కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ఇందు నిమిత్తం పి ఎం డి ఎస్( ఫ్రీ మూన్ సన్ డ్రై షోయింగ్) విధానం కింద 30 ఎకరాల పొలంలో విత్తనాలు చల్లాలని ఎటువంటి క్రిమి సంహారక ఎరువులు ఉపయోగించకుండా పొలాన్ని సారవంతం చేయాలన్నారు. ఒంటిమిట్ట మండలంలో దాదాపుగా ఇప్పటికే 50 ఎకరాల్లో 162 మంది రైతులు తమ పొలాల్లో పిఎండిఎస్ పంటలు వేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఈ విధానాన్ని రైతులందరూ అమలు చేయాలన్నారు. ఈ రకంగా రైతులు తమ పశువులకు పశుగ్రాశం పంటలు వేసినందువల్ల పాడి పరిశ్రమలో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఎండాకాలంలో సైతం పశువులకు దాన సమృద్ధిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రాణి, వీఎల్ఓ, శేఖర్ రైతులు పాల్గొన్నారు.



# విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలతోనే టెన్త్‌లో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ప్రతిభ

### ఫెయిల్ అయిన విద్యార్థుల సమాచారం చెప్పే దమ్ము కార్పొరేట్ విద్యా సంస్థలకు ఉందా ?... యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజా సవాల్

రాజంపేట, మే 23 ప్రభాతవార్త

పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి విద్యాశాఖ రూపొందించిన ప్రణాళికలతో పాటు, ఉపాధ్యాయుల ప్రత్యేక కృషి ప్రశంసనీయమైనదని, విద్యార్థులు ఇదే పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తులో జీవిత లక్ష్యాన్ని సులభంగా చేరుకుంటారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ పేర్కొన్నారు. బహుముఖ ప్రజ్ఞకు ప్రభుత్వ పాఠశాలలు పట్టుగొమ్మలు అన్నారు. శనివారం మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో యుటిఎఫ్ రాజంపేట మండల అధ్యక్షులు జి.నాగేంద్ర అధ్యక్షతన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బి.లక్ష్మీరాజా, మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబులు మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి నూతన ఒరవడిని సృష్టించారని పేర్కొన్నారు. సరైన అవకాశాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో సైతం అద్భుతాలు సృష్టించగలరన్నారు. కార్పొరేట్ మాయాజాలంలో పడి ప్రభుత్వ పాఠశాలల పట్ల కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు చిన్నచూపు చూస్తున్నారని, ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన ఫలితాలు వారికి కనువిప్పు కావాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రచార ఆర్భాటంతో విద్యార్థులను ఆకర్షిస్తూ, లక్షలాది రూపాయలను దోచుకుంటున్నారన్నారు. సాధించిన ర్యాంకులు, పాసైన వారి వివరాలను మాత్రమే ప్రచారం చేసుకుంటారే తప్ప, ఫెయిల్ అయిన విద్యార్థులు వివరాలను ప్రకటించే ధైర్యం కార్పొరేట్ విద్యాసంస్థలకు లేదని వారు పేర్కొన్నారు. రాజంపేట డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎల్.నాగయ్య, రాజంపేట మండల విద్యాశాఖ అధికారి డి.సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు సాధించిన పరీక్షా ఫలితాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచేవిగా ఉన్నాయన్నారు. బోధనలో నైపుణ్యం, వృత్తిలో అనుభవం, తగిన విద్యార్హతలు కలిగిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులే చక్కగా బోధించగలరనే విశ్వాసం ఈ ఫలితాల ద్వారా మరోసారి రుజువైందని పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఇదే స్ఫూర్తితో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే అద్భుత అవకాశాలు వారి సొంతమని వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యా సామాగ్రి, నాణ్యమైన భోజనం తోపాటు, సమరూప దుస్తులు అందజేస్తున్నారని, భవిష్యత్తులో కృత్రిమ మేదో ఆధారిత విద్య అందుబాటులోకి వస్తున్నదన్నారు. ప్రజలు కార్పొరేట్ మోజులో పడి లక్షలాది రూపాయలు నష్టపోకుండా, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా రంగం కోసం నిరంతరం పాటుపడుతున్న యుటిఎఫ్ కృషిఅభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.హరి ప్రసాద్, జిల్లా కార్యదర్శులు పి.వెంకటసుబ్బయ్య, సి.వి.రమణమూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.చెంగల్ రాజు మాట్లాడుతూ యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడుతుందని తెలిపారు. అందులో భాగంగానే పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రతి ఏడాది మోడల్ పేపర్స్ ను రూపొందించి, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను పొందడానికి దోహదపడుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం సైతం చిత్తశుద్ధితో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.పరిమళ, ఎస్.సుహాసిని, శివరామ్ ప్రసాద్, కె.వెంకటసుబ్బయ్య, రాజంపేట మండల ప్రధాన కార్యదర్శి కె.శివయ్య, ట్రెజరర్ కె.శివకుమార్, సహాధ్యక్షులు ఎస్.వినోద్ కుమార్, గౌరవాధ్యక్షులు పి.సాంబశివరావు, యు.వెంకటసుబ్బయ్య, పి.రవిచంద్ర ప్రసాద్, ఎం.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలతో యుటిఎఫ్ నేతలు




మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజా

# ప్లాస్టిక్ రహిత వేంపల్లె దిశగా అడుగులు

### 50 ట్రాక్టర్లు చెత్త సేకరణ... పారిశుద్ధ్యం సిబ్బందికి కన్వీనర్ ఆధ్వర్యంలో భోజనాలు

వేంపల్లె మే 23 ప్రభాతవార్త

ప్లాస్టిక్ రహిత వేంపల్లెను చేసేందుకు గుజరాత్ రాష్ట్రంలో అమలవుతున్న వినూత్న పారిశుధ్య విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె గ్రామ పంచాయతీలో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈనేపథ్యంలో టిడిపి పులివెందుల ఇన్ ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి విన్నూత పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారభించారు. పగటిపూట ట్రాఫిక్, జనాల రద్దీ వల్ల పారిశుధ్య పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు రాత్రి సమయంలో పారిశుధ్య పనులు చేసేందుకు జిల్లాలోని ఆయా పంచాయతీల్లో ఉన్న 200 పారిశుధ్య సిబ్బందిని వేంపల్లెకు పిలిపించడం జరిగింది. దీంతో పారిశుధ్య సిబ్బంది అందరికి టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం పారిశుధ్య పనులకు టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ప్రారభించారు. స్థానిక నాయకులు, డీపీఓ, ఇతర అధికారుల పర్యవేక్షణలో కార్మికులకు వార్డుల వారీగా పనులు (టాస్క్) కేటాయించడం జరిగింది. దీంతో రాత్రి 9 గంటల నుండి తెల్లవారుజామున 4 గంటల వరకు గ్రామంలో అంత తిరిగి చెత్తను సేకరించి 50 ట్రాక్టర్లు చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలో ఎక్కడా చెత్త లేకుండా చేయడం, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించి ప్రజలకు రోగాలు రాకుండా చూడటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి మద్దతుతో జరుగుతున్న ఈ ప్రయోగం విజయవంతమైతే, భవిష్యత్తులో ఇతర గ్రామ పంచాయతీలు మరియు మున్సిపాలిటీలలో కూడా దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు ప్లాస్టిక్ వాడకం ప్రధాన ఆటంకంగా మారిందని దీనిపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన రావాలని స్పష్టం చేశారు.లడఖ్ పర్యటనలో ప్లాస్టిక్ వాడకంపై అక్కడి ప్రజలు మరియు డ్రైవర్లు చూపిన కఠినమైన వైఖరిని అవలభిస్తారని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల అనేక ఆవులు ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.భావితరాల భవిష్యత్తు కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పటి నుంచే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకునే అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్మికులకు అందరికి టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి భోజనాలు ఏర్పాటు చేయడం హర్షనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.




# వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా గుర్రంపాటి రమణారెడ్డి నియామకం

బద్వేల్ అర్బన్, మే 23 ప్రభాతవార్త

బద్వేల్ మున్సిపాలిటీ పరిధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుర్రంపాటి రమణారెడ్డి పార్టీకి సుదీర్ఘకాలంగా అందించిన విశేష సేవలకు తగిన గుర్తింపు లభించింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైయస్సార్సీపి విద్యార్థి విభాగం కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, సిఫార్సులు, సూచనల మేరకు గుర్రంపాటి రమణారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా శనివారం బద్వేల్‌లో గుర్రంపాటి రమణారెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, ప్రముఖ నాయకులు న్నపగా చెన్నకృష్ణారెడ్డి, పుత్త శ్రీరాములు, వేముల సుబ్బరాజా తదితరులు శాలువాలు కప్పి, పూలమాలలతో అత్యంత ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమితులైన గుర్రంపాటి రమణారెడ్డి మాట్లాడుతూ "గత అనేక సంవత్సరాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాల పట్ల ఉన్న నమ్మకంతో ఒక సామాన్య కార్యకర్తగా నేను చేసిన సేవలను గుర్తించి, నేడు నాకు ఇంతటి ఉన్నతమైన రాష్ట్ర స్థాయి పదవిని కట్టబెట్టడం నా అదృష్టంగా భావిస్తునానన్నారు. నాపై నమ్మకం ఉంచిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో నా శక్త్యాయుధాల వడ్డీ, రాత్రింబగళ్లు శ్రమించి పార్టీ బలోపేతానికి, విజయానికి కృషి చేస్తాను.





# వేల ఎకరాల్లో నేలకొరిగిన అరటి పంట

### లింగాల, పులివెందుల, వేముల మండలాల్లో భారీ నష్టం
### ఎకరాకు రూ.6 లక్షల నష్టం
### తక్షణ ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా చెల్లించాలని డిమాండ్

పులివెందుల,మే 23, ప్రభాతవార్త :

వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో ఇటీవల కురిసిన గాలివానలతో భారీగా దెబ్బతిన్న అరటి తోటలను కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లింగాల మండలంలోని పలు గ్రామాల్లో నేలకూలిన అరటి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21న వీచిన ఈదురుగాలులకు లింగాల, పులివెందుల, వేముల మండలాల్లో దాదాపు రెండు వేల ఎకరాల్లో అరటి పంట నేలకూలిందని తెలిపారు. ఇప్పటికే సాగునీటి సమస్యలు, గిట్టుబాటు ధరల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ ప్రకృతి విపత్తు తీవ్ర ఆర్థిక దెబ్బతీసిందన్నారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వేల ఎకరాల్లో పంట నష్టం సంభవించడంతో రైతులు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయడంతో పాటు ప్రతి రైతుకు పంటల బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు.గత ఏడాది మార్చిలో కూడా ఇదే తరహాలో గాలివానల కారణంగా అరటి పంటలకు భారీ నష్టం సంభవించిందని గుర్తుచేశారు. అరటి పంట బీమా చెల్లింపులు వెదర్ బేస్ట్ స్టేషన్లలో నమోదయ్యే గాలివేగంపై ఆధారపడుతు న్నప్పటికీ, ఆయా స్టేషన్లు సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపించారు. గతంలో నష్టపోయిన గ్రామాల గాలివేగ రికార్డులు పరిశీలిస్తే "నాట్ అప్లికబుల్"గా నమోద య్యాయని తెలిపారు. ప్రస్తు తం ఈనెల 21న నమోదైన గాలివేగం కూడా సరిగా రికార్డు కాలేదని విమర్శిం చారు. ఈ సమస్యను గతంలోనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. రైతులు ఒకవైపు నీటి కొరత, మరోవైపు గిట్టుబాటు ధరల లేమితో ఇబ్బందులు పడుతుండగా ప్రకృతి వైపరీత్యాలు మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎంపీ అవినాష్ రెడ్డి కోరారు.



# మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం

ప్రొద్దుటూరు క్రైం, మే 23, ప్రభాతవార్త:

జిల్లా పోలీసు యంత్రాంగంమహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలు, వర్కింగ్‌ఉమెన్స్ హాస్టళ్లలో, మహిళలు ఉద్యోగాలు చేసే కంపెనీలలో గ్రామాలలో కాలనీలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యతను మరియు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై శనివారం ప్రొద్దుటూరు వన్‌టౌన్ తక్షశిల కోచింగ్ సెంటర్‌లో మహిళలకు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112కుకాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రించారు. డయల్ 112 (అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 1098(పిల్లల రక్షణ), గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రతి మహిళ తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి ఎస్సై మధుసూదన్‌రెడ్డి వారిని చైతన్యవంతులను చేశారు.




# మా గ్రామాన్ని యధావిధిగా కొనసాగించాలి

### ఆర్డీవోకు విన్నవించిన ఈగ వెంకటరమణారెడ్డి

బద్వేలు, మే 23, ప్రభాతవార్త



బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చెముడూరు గ్రామం ఇప్పటివరకు 32వ ఎన్నికల వార్డులో కొనసాగుతుండేది. అయితే నూతనంగా ఏర్పడిన వార్డుల విభజనలో భాగంగా సదరు గ్రామాన్ని 31 వార్డు చెన్నంపల్లిలో కలపడం జరిగిందని, ఇది ఇక్కడి గ్రామ ప్రజలకు ఇబ్బందిగా మారిందని తెలియజేస్తూ చెముడూరు గ్రామానికి చెందిన ఎల్ఎస్ పి డ్యాం చైర్మన్ ఈగ వెంకటరమణా రెడ్డి, గ్రామస్తులతో కలిసి ఆర్డిఓ చంద్రమోహన్ కు మరియు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు చెముడూరు మరియు చిన్నకేశంపల్లి కలిసి ఒకే ఎన్నికల వార్డులో దశాబ్దాలుగా కలిసి ఉన్నవి, దీంతో గ్రామ ప్రజలందరికీ చిన్నకేశంపల్లి గ్రామంతోనే సంబంధాలు, ఓటరు నంబర్లు మరియు పరిపాలనా అనుబంధాలు కలిగి ఉన్నారన్నారు. అంతేగాక ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామాలు కలిసి ఉండటంతో ఇక్కడ ప్రజలు అన్నదమ్ముల వలె కలిసి ఉండేవారని, పై విషయాలను దృష్టిలో ఉంచుకొని 32వ వార్డు (చిన్నకేశంపల్లి) లోనే చెముడు గ్రామాన్ని కొనసాగించడం ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. గ్రామాన్ని 31వ వార్డుకు మార్చడం వల్ల ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సదరు విషయాన్ని పునరాలోచించి గ్రామ ప్రజల వినతిని గౌరవించి, చెముడూరు గ్రామాన్ని తిరిగి 32వ ఎన్నికల వార్డు (చిన్నకేశంపల్లి)లోనే కొనసాగించవలసిందిగా కోరారు.

# స్వచ్ఛ పులివెందుల కోసం ఆపరేషన్ క్లీన్ స్వీప్"

### చీపురు పట్టి ప్రజల్లో చైతన్యం కల్పించిన బీటెక్ రవి
### పారిశుధ్య కార్మికులతో కలిసి పాల్గొన్న టీడీపీ నేత



రోడ్డు పై చీపురు పట్టి అవగాహన కల్పిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, మే 23, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు బీటెక్ రవి ఘనంగా ప్రారంభించారు. శనివారం పట్టణంలోని స్వయంగా పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లపై చెత్తను తొలగిస్తూ స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. చేతిలో చీపురుతో వీధులను శుభ్రం చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచడమే కాకుండా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, యువత మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ద్వారా పట్టణ ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన, బాధ్యత పెంపొందించాలని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో
# కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు మే 23 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణంలో గత ఐదేళ్లుగా టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి భోజనం వసతి కల్పించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ సంతృప్తి వ్యక్తం చేస్తూ గత ఐదేళ్లుగా పట్టణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్ అభినందనీయులని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయనకు అమ్మవారు శక్తిని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ మూరబోయిన శ్రీనివాస్ యాదవ్ నల్లం రవిశంకర్ జయచంద్ర బోడే ప్రసాద్ బంగి శివకుమార్ యేసునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

